# ఆనంద నిలయం ★

రచన :
" కోవెల "

"నీలాంటి వెధవ లుండబట్టే దేశం యీవిధంగా పాడైపోతోంది,లేకపోతే యేమిఁటిరా? ఆ పిల్లనుతప్ప యింకెవ్వరినీ చేసుకోనంటావ్! ఏవిటా పిల్లలో ఉన్నది? రమ కంటే చక్కగా వుంటూందా? అంతకంటే ధనమున్నదా, కులంపెద్దదా? పొయ్యిపొయ్యి ఆ మాలదాన్ని చేసుకుంటావట్రా అంటూ తాచు పాములాగా బుసలు తున్నారు నీలకంఠం కొడుకుమీద.

'అసలు వాడనేదేమిటో పూర్తిగావినకుండా ఎందుకండీ అలాకేకలేస్తారు' అంటూన్న భార్యను చూచి ఏమిటే నీదొక మధ్య వర్తిత్వం, వాడలా కులం తప్పినదాన్ని చేసుకుంటానంటే నువ్వు కూడా సపలదీస్తున్నావ్, అని గుడ్లెర్ర చేసాడు.

దీనంతటికి కారణం, నీలకంఠంగారి ఏకైక పుత్రుడు రామం. రామం బి. ఏ. చదువుతున్నాడు. చిన్నప్పటినుండి గారాబంవల్ల పెంకితనం అలవాటయింది. కాస్త చిలిపివాడుకూడ.

* * *

ఒకరోజున కాలేజిలో మెట్లుదిగుతూ వుండగా ఒక అమ్మాయి మెట్లు ఎక్కుతూండడం చూచాడు. చూస్తూవూరుకోలేక హలో! అన్నాడు. ఆ అమ్మాయి కూడా మళ్ళీ హలో అంది.

చచ్చారా బాబూ! అనుకుని మీపేరూ... అన్నాడు.

శశిరేఖ! అన్నదామ్మాయి అతని వంక ఎగాదిగాచూచి. మీనాన్న బలరామదేవుడి గృహం బెక్కడనో సెలవిచ్చెదరా? అన్నాడు రామం. తమరు రథం వేసుకుని నావెంట పడుతూవస్తే అదే కనబడుతుంది అన్నదామ్మాయి గోముగా. నారథంమీద తమరు కూడా వస్తే దింపిమరీ పోతాగా అన్నాడు రామం చిలిపిగా.

ఏమిటండి! మీగోల! అంటూ చరచరా వెళ్ళిపోయింది ఎవరో వస్తూన్న అలికిడివిని. ఏమిట్రా అలాచూస్తున్నావు 'మాయాబజార్' లో అభిమన్యుడి ఫోజు పెట్టి? అంటూ మెట్లెక్కుతూన్నాడు సత్యం. పోరా లక్ష్మణకుమారా! అన్నాడు రామం నవ్వుతూ.

వరేయ్!, నీ చేత నాలుగు చెఱువుల నీళ్ళుతాగిస్తుంది జాగ్రత్త! అన్నాడు సత్యం.

కొంపతీసి నీకు తెలుసేమిటిరా ఆ అమ్మాయి? అన్నాడు రామం బిక్కమొహంపెట్టి. సత్యం పగలబడి నవ్వుతూన్నాడు. ఏడిచావులే! ఎందుకోయ్ నవ్వు? వూరికినే అనలా లక్ష్మణకుమారుడని అంటూ విసుగ్గున్నాడు.

వరేయ్! రాముడూ! అది మాచెల్లెలు శశిరేఖరా అన్నాడు సత్యం నవ్వుతూ. అంతే, రామం బట్టలు చమటతో తడిచి పోయినయ్. మొహంయెత్తి చూడలేక పోయాడు సత్యంవంక. నెమ్మదిగా సత్యం రామం బుజం పట్టుకుని కాలేజి కాంటిన్‌లో ఒక మూలకు తీసుకపోయి కూర్చొబెట్టి, రెండుటీలకు ఆర్డరిచ్చి రామం వంక చూశాడు. అప్పటికే పాపం అతను చాలాబాధపడుతూన్నట్లుగా కనిపెట్టి ఒరే! రాముడూ! ఏమిటోయ్ యిదీ? నేనట్లా యేమి అనుకోన్రా! యింకెవరన్నా అయితే యేమోగానీ, అయినా కోయెడ్యుకేషన్‌లో యీ వెధవ ఫార్మాలిటీస్ యేమిటీ? అన్నాడు.

అప్పటికి సత్యం మాటలకు కుదటపడి టీ త్రాగడం ప్రారంభించాడు. ఇంతలో పెద్ద గాలివానలాగా నలుగురు ఆడపిల్లలుగూడా వచ్చారు కాంటిన్‌లోకి. అందులో శశిరేఖకూడా వుంది. చూచి గూడ మెదలకండా టీ కప్పులోకి చూస్తూ వూరుకున్నాడు రామం. కాంటిన్‌లోకి మిగతా నలుగురుతోపాటు వచ్చిన శశిరేఖను యిలా రమ్మన్నట్టుగా సైగచేసాడు సత్యం, ఆ మెయింకా రామాన్ని చూడలేదు. మెదలకుండా వచ్చి యేమిటన్నయ్యా! అంటూ కూర్చుంది. ప్రక్కన్నే కూర్చునివున్న రామాన్నిచూచి ఉలిక్కిపడి మళ్ళీ సర్దుకుంది.

ఇంతలో మిగతా ముగ్గురు కూడా వచ్చి నమస్కారమండీ! సత్యంగారూ అంటూ చుట్టూవున్న కుర్చీల్లో కూలబడ్డారు. వెంటనే రామాన్నిచూసి యీ ఆసాధ్యుడిక్కడ వున్నాడూ! అనుకున్నారు. వాళ్ళకు రామం సంగతి కాస్త తెలుసునట్లున్నది. రామం సత్యం వంకచూచి క్లాసు కెళ్తారా అన్నాడు. వెళ్ళొచ్చులే కూర్చోఅన్నాడు. క్లాసిప్పుడు లేదని సత్యానికీ తెలుసు. ఇంతలో వాళ్ళకు కూడా టీ వచ్చింది. అంతట త్రాగడం పూర్తిచేశారు.

హలో! సత్యం అంటూ శివశంకరం వచ్చి కూర్చొబోయి ఆడపిల్లల్ని చూచి తటపటాయించి మళ్ళీ ఏమనుకున్నాడో కూర్చున్నాడు.

సత్యం అంటే కాలేజీలో అందరికీ ఒకవిధమైన గౌరవం. అందరితోను కలిసిమెలిసి వుంటూనే మన డిగ్నిటీ మనం నిలబెట్టుకోవాలంటాడు సత్యం. శివశంకరం కాలేజి ప్రతివిషయంలోనూ తలదూరుస్తాడు. అతనికి తెలియని విషయం అంటూ వుండదు. మంచినటుడు, రచయితకూడా. కాలేజీ కెన్నోసార్లుపేరు తెచ్చి పెట్టారు తన నటనా కౌశలంవల్లా, రచనా నైపుణ్యాంలోను. అయితేమనిషి చూస్తే అంతవాడనిపించదు. సరిగదా, అసలు తనే ఒప్పుకోడు నువ్వింతవాడివిరా! అంటే.

అందరిని నవ్విస్తుంటాడు. సరదా అయిన మనిషిలాగ కనిపిస్తూనే తనలో తను ఏదోఆలోచిస్తూనే వుంటాడు. ప్రతి విషయానికి సంబంధించిన అగాధాల్లోకి తొంగి చూడాలని ప్రయత్నిస్తుంటాడు. ఆడపిల్లలంటే అతనికి ఒక విధమైన గౌరవం. ఒక్కొకసారి తన మామూలు ధోరణిలో వాళ్ళనేదో అని ఏడిపిస్తుంటాడు. అందరూ నవ్వేట్టుచేస్తాడు. ఆ తరువాత పాపం వాళ్ళేమనుకున్నారో అని బాధపడతాడు. అయినా కాలేజీలో అతనికి కలుపుగోలుతనంవల్ల మంచి పేరు ఏర్పడింది. ఆడపిల్లలు కొంచెం చిలిపిగా చూస్తారు అతనివంక. ఎందుకో అతనికి అర్థంకాదు.

ఒక్కొక్కసారి వాళ్ళమీద కోపం కూడా వస్తుంది శివశంకరానికి.

రమకి మాత్రం అతన్ని చూస్తే ఫక్కున నవ్వాలనిపిస్తుంది. ఎందుకో ఆమెకు తెలియదు. ఆమెను చూస్తే శివశంకరానికి శివం ఎత్తినంత పనయ్యె నెత్తిమీద మొట్ట బుద్ధవుతుంది. అందులో రమకూడా వుండడంవల్లనే కాస్త తట పటాయించినా కూర్చున్నాడు ఆమెనేడిపిద్దామని. వస్తున్న నవ్వునాపుకుంటూ సీరియస్ ఫేస్ పెట్టింది రమ.

యేమిటో పెద్ద చర్చలు జరుగుతున్నట్లున్నాయి, ఏమిటిసంగతి? రామం! మీరంతా టీ తాగారు మరి నాకేదోయ్ అంటూనే సర్వర్‌ని పిలిచి టీ ఆర్డరిచ్చి బాతాఖాని మొదలెట్టాడు. శివశంకరం మాట్లాడుతూంటే ఎందుచేతనో ఎవరికీ లేవబుద్ధికాదు. ఎప్పుడూ అతనితోటి కాలంగడిపితే బాగుండునూ అనిపిస్తుంది.

టీ త్రాగుతూ వున్నట్లుండి "పాపికొండలు" అన్నాడు శివం. ఆడపిల్లలు వులిక్కిపడ్డారు. రామం, సత్యం యిహ నవ్వుకోలేక పుస్తకాలడ్డం పెట్టుకున్నారు ఆఖరికి సత్యం ఏమిట్రాఅది అన్నాడు.

అప్పటికె లైబ్రరి పుస్తకమండి అంటూ తిరగేస్తున్నాడు బల్లమీదవున్న రమ పుస్తకాల్ని పరికిస్తు యేమితెలియని అమాయకుడ్లాగా. 'అవునండీ!' అంటూ పమిట సర్దుకుంది రమ. ఆ క్షణంలోకి వాళ్ళిద్దరి కళ్ళూ ఎందుకో మెరిశాయి.

సత్యం అక్కడవున్న సరళవంక చూశాడు. అన్నయ్య పరధ్యాన్నంలో వుండడం చూచి రామం వంక ఓరగా చూసింది శశిరేఖ. మిగిలిపోయిన ఉపబెంబేలు పడిపోయి కాంటెన్ పైకప్పు పరికించడం మొదలెట్టింది. కుర్రాడు బల్ల తుడవడానికి వచ్చేటప్పటికి అందరూ మామూలు ధోరణికివచ్చారు. క్లాసుకు టైమైందంటూ రామం లేచాడు.

'పాపి కొండలు' ఒకసారి యిస్తారా యివాళ చదివి రేపుయిస్తాను అంటూ లేచాడు శివం. 'తప్పకుండా' దానికేమిటి తీసుక వెళ్ళండి అంటూ 'పాపి కొండలు' అందించింది రమ అంతా బయటకు వెళ్ళారు.

"ఏమయ్యా అయ్యరూ! మన కాంటిన్ పేరు ఆనంద నిలయం అని పెట్టరాదూ అన్నాడు శివం బిల్లుయిస్తు.

"తప్పకుండా పెడ్తానూ, మీరుచెప్పిన తరువాత పెట్టకుంటే బాగుండునా" అన్నాడు అయ్యరు బొర్రసర్దుకుంటూ. వినాయకుడి అపరావతారం వీడి దుంపతెగ! అంటూ బయటకువస్తున్న శివాన్ని చూసి అందరూ ఫక్కున నవ్వారు.

ఆనాటినుండి అందరం కలిసి రోజు లీజరు సమయాల్లో ఆనంద నిలయానికి వస్తే యెంత బాగుంటుందీ! అనుకున్నారు ఎవరిమనసుల్లో వాళ్ళు. వెళ్తాంరా, అనుకుంటూ క్లాసు కెళ్ళారు సత్యం, రామం. నవ్వుతూవస్తాం! అన్నట్లుగా చూచి రమ శశిరేఖ వగైరాలు వెళ్ళి పోయారు. తన కిఫ్త్ క్లాసు లేకపోవడంచేత 'పాపి కొండలు' తిరగేస్తూ, ఏమిటో ఆలోచిస్తూ అక్కడే స్థంభానికి అనుకున్నాడు శివశంకరం.

*   *   *

అప్పటినుండి రామం, సత్యం ఇంటికి వస్తూపోతూ వుండేవాడు. అతను వచ్చినప్పుడల్లా "అన్నయ్యా! టీ పట్టుకెళ్ళవూ" అంటూ పిలిచేది శశిరేఖ. తనలో తను నవ్వుకుంటూ వస్తున్నానని లోపలికెళ్ళి టీ పట్టుకొస్తు నీ పుణ్యాన నాగొంతులో కాస్త టీ పడుతుందివాళ, రోజు వస్తుండరా నాయనా! అంటూవుండేవాడు సత్యం. నవ్వాపుకొనేవాడు రామం. ఆవిధంగా వాళ్ళ కుటుంబానికి బాగా సన్నిహితుడై పోయాడు రామమూర్తి. సత్యంకూడా అప్పుడప్పుడు రామం యింటికివస్తు వుండేవాడు. నాకూ ఒక చెల్లెలుంటే ఎంత బాగుండును అనుకునే వాడు రామం శశిరేఖ చేష్టల్ని తలుచుకుంటూ.

ఒక రోజున యిద్దరూ షికారుకని అలా బయలుదేరారు. ఎన్నాళ్ళనుండో చెప్దాం అనుకున్నది యిహ యివాళ చెప్పేద్దాం అనుకున్నాడు రామం.

"సత్యంనీతో ఒకమాట చెప్దాం అనుకున్నానోయ్, యిందులో నేను పొరపాటు చేస్తున్నాననిగాని, తప్పనిగాని నీకు తోచిన కోపం వచ్చినా నన్ను క్షమించి మామూలుగా స్నేహంగానే వుండాలి ఆ ఒప్పందం మీదేచెప్తాను" అన్నాడు రామం.

"ఏమిటి చెప్పు."

"నేనునీకు ఎన్నాళ్ళనుండో చెప్దాం అనుకున్నాను, కాని అవకాశం దొరకలేదు, బహుశానాకు ధైర్యంచాల లేదు. నేనుమీ...శశిరేఖను.

"ప్రేమిస్తున్నావా రామం? అదినాకు తెలుసు. అందులో నాకు అభ్యంతరం ఏమాత్రంలేదు. ఎవరో క్రొత్తగా వచ్చిన వ్యక్తి అప్పటికప్పుడు పెళ్ళిచూపులకొచ్చి నచ్చిందని పెళ్ళిచేసుకోవడం, అతన్ని పెద్దగౌరవంగా చూస్తు ఏమంటాడో అన్నట్లుగా భయపడుతుండడం యివన్నీ నాకు చెడ్డచిరాకెత్తాయి రాముడూ! అదిగాకుండా చెల్లినిన్ను బాగా అర్థం చేసుకుందనుకుంటాను. నువ్వుగూడా దాన్ని అర్థం చేసుకున్నావనుకుంటున్నాను."

"కాని నువ్వేమనుకుంటావో అనే నాకు యిదిగావుంది. అయినా మీ చెల్లి అభిప్రాయం ఏమిటో మరి"

"అది తొణకని కుండ రామం. అందరిలాంటిదిగాదు మా చెల్లి. పైకికనపడదు. దానిదగ్గర రహస్యం నేనే లాగను, నాదగ్గర రహస్యం అది లాగగల్దు. నే చూస్తాలే అంతా."

"సరే ఏమనుకోవు గదా!"

మళ్ళీ అదేమంట, నేను యిటువంటి విషయాల్లో కళ్ళనీళ్ళు తుడిచే మాటలు మాట్లాడను. నీకు తెలియనిదేముంది. అయితే ఒక్కమాట ప్రేమ, వివాహం, జీవితం, సంసారం. యివన్నీ ఏమిటో ఊహించుకున్నంత తేలికగా వుండవు. వాటిని నెమ్మదిగా ఆలోచించి జాగ్రత్తగా ముందురాబోయే కష్టసుఖాల్ని గురించి ఆలోచించుకోవాలి. అప్పుడుకాని యిటువంటి వ్యవహారాలను గురించి పరిష్కారం చేసుకోకూడదు. ఇంటికి వెళ్ళి మీవాళ్ళ అభిప్రాయం కూడా కనుక్కో. మా యింట్లో నువ్వంటే ఎవరూ కాదనరు. అదంతా నామీద వదిలివెయ్యి, వస్తా!" అంటూ నెమ్మదిగా యింటికి వెళ్ళిపోయాడు సత్యం.

సత్యం అన్నమాటల్ని గురించి ఆలోచిస్తూ ఇంటికి వచ్చేవాడు రామం. రెండు మూడు రోజుల తరువాత ఒక రోజున తల్లి సీతారావమ్మ, "మొన్న వచ్చిన వాళ్లు పిల్ల నచ్చిందో, లేదో రాయమన్నార్రా!" అంటూ మొదలెట్టింది. రామం గదిలోకి వచ్చి యిదే సమయమనుకుని ధైర్యంచేసి నెమ్మదిగా అమ్మ దగ్గరవుండే చనువుకొద్దీ అంతా చెప్పేశాడు. శశిరేఖతప్ప ఇంకెవరన్నా అయితే



నాకు చేసుకోబుద్ధి కాదన్నాడు. అమె మరింకేం నీకు నచ్చితే మాకభ్యంతరమేమిటి నాయనా! మీ నాన్నను రానీ 'చెప్పిచూస్తా' నంటూ బరువుదిగిన దానిలాగా వంటింట్లోకి కదిలిపోయింది సీతారావమ్మ.

భర్తవచ్చిన తరువాత "అబ్బాయి యిలాగంటున్నాడండీ! అని రామం చెప్పినదంతా యేకరువుపెట్టింది తమలపాకు లందిస్తూ సీతారావమ్మ. రేపు మాట్లాడతాలే వాడితో ఆదివారమే. పక్క వెయ్యి!" అంటూ పడక కుర్చీలోంచి లేచాడు నీలకంఠంగారు.

* * *

'పాపి కొండలు' పట్టుకొని వెళ్ళిన శివశంకరం పుస్తకం పూర్తిచేసి పండుకున్నాడు. కలలో అతనికి నిజంగా 'పాపి కొండలు మధ్య తను పడవలో వెళ్ళినట్లుగానే అనిపించింది. వెళ్ళాడు కూడా! కూజాలో నీళ్ళన్నీ త్రాగేశారాత్రి తెల్లవారేటప్పటికి ఎందుకో లేద్దాం అనుకుని కూడా లేవలేక పోయాడు.

ఇంతలో "అన్నయ్యా! ఎండెక్కిపోతోంది, అమ్మ లేపమంటోంది లే అన్నయ్యా!" అంటూ లేపింది చెల్లి చిట్టి. ఇది వదలదురా బాబు అనుకుని ముసుగు తీసి లేచాడు శివం. 'పాపి కొండలు' పరుపుమీద నలిగిపడివుంది. అప్పుడు జ్ఞాపకంవచ్చింది తను చదువుతూనే పడుకున్నానని, అయ్యో! రమ యిల్లా పుస్తకం నలిగిపోయిందని ఏమనుకుంటుందో అని బాధపడ్డాడు.

నెమ్మదిగా టూత్పేస్టు, బ్రెష్ తీసుకున్నాడు. చిట్టివచ్చి "అన్నయ్యా! నాకు యివాళ రిబ్బను తెచ్చిపెట్టవా" అంది.

"రేపు తెచ్చిపెడ్తాలేమ్మా యివాళ పనుంది"

"నీకెప్పుడూ పనే!"

"రేపు తెస్తాగా చూడు."

"ఏమొద్దులే, నాకివాళే కావాలి"

"అయితే కాలేజీలో ఏ అమ్మాయి రిబ్బనన్నా లాక్కొస్తాలే"

"అన్నయ్యా, మరి అల్లారిబ్బన్లుతీసుకుంటే మీ బళ్లో కొట్టరూ ఆడపిల్లలు?" సమాధానం చెప్పలేక నాలుక కొరు

క్కొన్నంత పనయింది శివశంకరానికి. ఇద్దరి మాటలువిని నవ్వుకుంది వాళ్ళమ్మ రంగనాయకమ్మ.

"అమ్మా నా కన్నయ్యా రిబ్బనుతెచ్చి పెడ్తానన్నాడమ్మా" అంటూ వంటింట్లో కివచ్చింది చిట్టి నవ్వుతూ "కాఫీ, టిఫిను యివ్వు అన్నయ్యకి వెళ్ళు" అంటూ అందించింది తల్లి.

ఆరోజున కాలేజీలో రమకు "పాపికొండలు" యిచ్చాడు. "చదివేశారా?" అంది రమ పుస్తకం అందుకుంటూ.

ఆc! థాంక్సండీ! అన్నాడు శివం. ఆమె నోమస్తన్! అంది. యింతలో రామం కనబడితేనూ "వస్తానండీ మళ్ళీ కలుసుకుందాం" అంటూ గబగబా వెళ్ళాడు శివం. అతనికేసే చూస్తూ నిలబడింది రమ.

అక్కడికి వచ్చిన శశిరేఖ రామాన్ని చూస్తూ నిలబడింది. కొంతసేపటికి ఒకరొకరు చూచుకుని నవ్వుకుంటూ వెళ్ళిపోయారు లేడీస్ వెయిటింగ్ రూములోకి.

తర్వాత పుస్తకాన్ని చూచి నవ్వుకుంది రమ. ఇలా నలిగిపోయిందేమిటి, చిన్న పిల్లాడికంటే అధ్వాన్నం అనుకుంది. కేర్‌లెస్‌మాన్ అనుకుంది. రమ అప్పుడప్పుడు శివం కథలు అన్నీ చదివేది. అతని భావాలు ఆమెకు వింతగానూ, మామూలు మనిషి కందనివిగానూ అనిపించేవి అతన్ని అడుగుదాం అనుకునేది కాని అడగలేక పోయేది. ఎన్నోసార్లు ఆ తరువాత అతనితో మాట్లాడాలని ప్రయత్నించింది రమ.

శివం మాత్రం కనపడ్డప్పుడు చిన్నగా నవ్వి వూరుకునేవాడు.

అతనికోసం ఎన్నో మంచి నవలలు అతనికి కనపడేటట్లుగా పట్టుకునేది పుస్తకాలతోపాటు. చదివారా అంటే ఎప్పుడో చదివేశాననేవాడు పూర్తి తెనుగు పుస్తకాలన్నీచదివిన వాడిలాగా. భలేవాడే మొత్తానికి! అనుకునేది రమ.

అందరిలాగా తన వెనకాల పడి నట్లుగా కనపడడు, అదే శివంలోవున్న ప్రత్యేకత. తన్ను గురించి అతని అభిప్రాయం తెలుసుకోవాలనే కుతూహలం ఏర్పడింది రమలో. ఆఖరికి ఒకరోజున శివాన్ని తన పుట్టినరోజు పండుగకు ఆహ్వానించింది మిగతా స్నేహితులతో పాటు. రమకు మేనత్తకొడుకు రామం. అందుచేత బావను కూడా పిలవమని తల్లి, తండ్రి చెప్పడంవల్ల రామాన్ని కూడా పిలిచింది.

ఆరోజున రామం, శివం తప్ప అంతా ఆడపిల్లలే రమ పుట్టిన రోజుకువచ్చింది. అందరూ ఏవేవో బహుమతులు తెచ్చారు రామం ఒక దంతపు పెట్టెను తెచ్చి యిచ్చాడు. అంతా వెళ్ళిపోయారు. రామం తల్లి తండ్రితో జట్కాలో వెళ్ళి పోయాడు యింటికి. వాళ్ళను సాగనంపి తన రూములోకివచ్చి వాళ్ళమ్మా నాన్నలతో పరిచయం చేసింది శివాన్ని రమ.

"చల్లగా చదువుకుని పైకిరా నాయనా" అంటూ దీవించారు వాళ్ళిద్దరూ శివాన్ని, రమచిలిపిగా నవ్వింది. వెళ్ళేటప్పుడు "మీరు నాకేమి తెచ్చారు" అన్నది రమ. "ఏం కావాలి?" అన్నాడు శివం. ఆమెకళ్లు ఏదోకావాలన్నాయి. అతని కళ్ళు ఏదో యిస్తామన్నాయి.

వస్తా రమా! నమస్కారమండీ! అని వాళ్ళవాళ్ళతో చెప్పివెళ్ళిపోయాడు.

ఎవరబ్బాయమ్మా? అన్నాడు తండ్రి శివరామ కృష్ణయ్య రమతో.

"వకీలు రంగనాథం గారబ్బాయి నాన్న"

అలాగా! మంచివాడు, మర్యాదస్తుడు తండ్రిలాగా" అన్నాడు శివరామ కృష్ణయ్యగారు.

ఇంటికి వెళ్ళగానే "రిబ్బనుతెచ్చావా అన్నయ్యా!" అనిఅడిగింది ఆరేళ్ళచెల్లి చిట్టి. "మరిచి పోయానమ్మా!" అన్నాడు శివం. బిక్కమొహం పెట్టేసింది. చిట్టి ఓదార్చాలని దగ్గరకి తీసుకుని మరే! బళ్ళోనే నువ్వు రిబ్బను తెమ్మన్నావుగదా అని ఒక అమ్మాయి రిబ్బను పట్టుకున్నాను, గబుక్కున వచ్చి బుగ్గమీద కొరికేసింది చూడమ్మా! అంటూ బుగ్గ చూపించాడు.

"అయ్యో; ఎవరన్నయ్యా పాడుది ఇలా కొరికింది" అంటూ చిట్టిచేత్తో నిమిరింది అన్నయ్యబుగ్గని.

"భోజనానికి లేవరా" అంది తల్లి రంగనాయకమ్మ.

"తినలేనమ్మా, యిప్పుడే టీపార్టీ నుంచి వస్తున్నా"

"ఏడ్చావులే, ఎంత సేపుంటయ్యిరా ఆ టీనీళ్ళు. పిచ్చి—వెళాలన్నీనూ" అంటూ కేకవేసింది.

నా పుట్టినరోజు పండుగకుకూడ రమని, పిలవాలను కూంటూ భోజనానికి లేచాడు శివం.

తరువాత ఒకరోజున చిట్టిని తీసుకుని సినిమాకు బయలుదేరాడు శివం. సినిమాకు బయలుదేరడం చిట్టి మూలాన్ని కొంచెం ఆలస్యమయింది. అందుచేత సినిమా మొదలెట్టేశారు. చీకట్లో ఎక్కడో స్థలందొరికితేను కూర్చున్నారిద్దరూ. సినిమా చూస్తున్నంతసేపూ ప్రతిదానికి "అదేమిటన్నయ్యా? ఆ అమ్మాయి ఎందుకేడుస్తున్నది?" అని యిలా ఏవేవో ప్రశ్నలు వేస్తూనే వుంది. పాపం వీలయినంతవరకు చెప్తూనే యిహ విసుగుపుట్టి "అరవకుండా చూడు" అని అన్నాడు. పాపం మెదలకుండా చూస్తూకూర్చున్నది పది నిమిషాలపాటు. ఇంతలో యేదో సందేహం వచ్చి అడగబోయింది. యింటర్వెల్ బెల్ కొట్టేశారు! చిట్టికేదో చెప్పబోయిన శివం ప్రక్కనేవున్న రమనిచూచి ఆశ్చర్యపోయి వాళ్ళ వాళ్ళతో "నమస్కారమండీ!" అన్నాడు.

ఓహో! నువ్వా నాయనా శివం. మీ చెల్లెలా? అన్నారు చిట్టివంకచూచి "అవునండీ" అన్నాడు వెంటనే "ఇలా రా, పాపా!" అంటూ తనదగ్గర కూర్చోబెట్టుకుంది రమ చిట్టిని. శివరామ కృష్ణయ్యగారు అందరికి కూల్‌డ్రింక్స్ తెప్పించారు. మొహమాట పడుతూనే తాగేశాడు శివం. చిట్టికి జాగ్రత్తగా గౌను మీద పడకుండా రమ పట్టించింది, సినిమా మొదలయింది. ఇహవాళ్ళిద్దరూ స్నేహితు లయిపోయారు. చిట్టి ఏమి టేమిటో అడుగుతోంది, రమ చెప్తోంది. మంచి ప్రణయ సన్నివేశం వచ్చింది. వాళ్ళిద్దరూ ఏం టక్కా చేస్తున్నారు అంది చిట్టి. 'మీ అన్నయ్యనడుగు' అంది రమ నెమ్మదిగా చిట్టి చెవులో. శివం బుజం పట్టుకులాగి "అన్నయ్యా

వాళ్ళిద్దరేం చేస్తున్నారో చెప్పవా?" అంది చిట్టి.

"ఏం లేదమ్మా, ఆ అబ్బాయి రిబ్బను తీసుకున్నాట్ట, అందుకని ఆ అమ్మాయి కొరుకు తింటోంది" అన్నాడు శివం ఏంతోచక. లేకపోతే గోల పెడుతుందేమోనని.

ఆమాటవిని రమ ఫక్కున నవ్వింది. చిట్టిని తనవేపు లాగుకుని కూర్చోబెట్టుకుంది. సినిమా తరువాత "వెళ్ళొస్తానక్కా" అని రమతో చెప్పి చిట్టి వాళ్ళన్నయ్యతో యింటికి బయలుదేరింది. వెళ్తూన్న రమ, చిట్టిని పిలిచి పాపా! మా యింటికి ఒకసారిరా! అని చెప్పింది పెద్దగా. ఓ! అన్నయ్యనుకూడాతెస్తానక్కా అంది చిట్టి. అంతా నవ్వుకున్నారు చిట్టి మాటలకి.

ఇంటికివచ్చిన తరువాత అమ్మతో రమక్కయ్యనుగురించి రాత్రి 12 గంటలదాకా చెపుతూనేవున్నది. చిట్టి 'ఎవర్రా, ఆ అమ్మాయి'' అన్నది రంగనాయకమ్మగారు.

"ఎవరోనమ్మ సినిమాహాల్లో కనపడ్డారు. దీనికి కొత్తా, పాతా లేదుగా, మాటల్లో ఆ అమ్మాయిని స్నేహం చేసుకుంది అన్నాడు శివం నవ్వుతూ.

మా చిట్టి తల్లి అంటూ ముద్దుకుందామె చిట్టిని.

"అంతా వుట్టిదేనమ్మా! మా చెల్లి అని అన్నయ్యే చెప్పాడు. అన్నయ్యతో మాట్లాడిందికూడానమ్మా రమక్కయ్యా అన్నీ అబద్దాలు!" రమక్కయ్య వాళ్ళ అమ్మ నాన్నాకుడా తెలుసమ్మా అన్నయ్యకు" నాకురిబ్బను తెస్తాననిగూడా అంటే, ఇంక నిన్నెవరూ అడగర్లే. రమక్కయ్య యిస్తుందిలే. ‹ ఎది చిట్టి శివం దగ్గరకొచ్చి.

"ఎడ్వావులే!" అన్నాడు అంతా చెప్పేస్తుందన్న విసుగుతో శివం.

"అమ్మా చూడమ్మా గిచ్చుతున్నాడు అరిచింది చిట్టి. ఎవర్రా ఆ అమ్మాయి అని మళ్ళీ రెట్టించి అడిగింది రంగనాయకమ్మగారు.

"మరీ, మన శివరామ కృష్ణయ్యా గారని పంచదార ఫ్యాక్టరీ మేనేజరు గారున్నారు వాళ్ళమ్మాయమ్మా, మా కాలేజిలో చదువుతుంది, సినిమాహాల్లో కనపడితేను...అని యింకా ఏదో చెప్పబోయాడు కాని "సరేలే పడుకో!" అంది వాళ్ళమ్మ.

రక్షించావురా భగవాన్ అనుకున్నాడు మనసులో. అప్పుడప్పుడు చిట్టి రమ యింటికి వెళ్ళివస్తూండేది. ఈ లోపల ఒకటి రెండుసార్లు ఎవరో పిల్లనిస్తాం అని రావడం, విని విననట్లుగా వూరుకోవడం యివన్నీచూచి కాస్త అర్థంకాక భర్తతో చెప్పింది రంగనాయకమ్మగారు.

"రమక్కయ్యలాంటి వదిన కావాలమ్మా నాకు" అంది చిట్టి.

"అంత మంచిదామ్మా, మీ రమక్కయ్య అన్నారు రంగనాథంగారు నవ్వుతూ.

"అవును నాన్నారూ! నాకు చాక్లెట్లిస్తుంది, అన్నయ్య కివ్వమని యిస్తుంది కూడా నాన్న" అంది నాన్నగారి ఒళ్ళో కూర్చుంటూ.

"ఊఁ! అయితే ఒకసారి శివరామకృష్ణయ్యను కలవమంటావా రంగా!" అన్నారు రంగనాథంగారు.

"మీ యిష్టం, వాడి సుఖమే మనకు కావలసింది. ముందు వాడ్నికూడా అడగండి" అంటూ చిట్టికి జడవేస్తూ కూర్చుంది రంగనాయకమ్మగారు రాబోయే కోడల్ని తలుచుకుంటూ.

సత్యం తనగదిలో కూర్చుని చదువుతూన్న పుస్తకాన్ని మూసి ఏమిటో ఆలోచిస్తూ తన బల్లమీదవున్న రాధాకృష్ణుల బొమ్మ వంక చూస్తూ కూర్చున్నాడు. అంతలోనే "అన్నయ్యా కాస్త ఈనోట్సు రాసిపెట్టవూ?" అంటూ గదిలోకి శశిరేఖ అతన్ని చూచి, అన్నయ్య యీమధ్య కాస్త పరధ్యాన్నంలో పడ్డాడనుకుంది. "ఒక గుమస్తాని పెట్టుకోరాదు నన్ను చంపకపోతే" అంటూ నోట్సు అందుకున్నాడు. దానిమీదవున్న 'సరళ' పేరు చూస్తూ కూర్చున్నాడు. అది చూచిన శశిరేఖ "అన్నయ్యా! పేరుచూస్తే మనిషి కనపడుతూందా? మొత్తానికి భలేసరదా అయింది. నాకు అందరిలోకి సరళ ఒక్కతే నచ్చిందన్నయ్యా" అని అతన్ని పరీక్షగా చూసింది. "సరళ అంత మంచిదా శశీ?" అన్నాడు సత్యం. "మా అన్నయ్య అడగమన్నాడు నువ్వు అంత మంచిదానివా? అని అడుగుతాలే రేపు" అంది నవ్వుతూ.

"కొంటిపిల్లా!" అంటూ ఒక్క మొట్టికాయిచ్చాడు శశినెత్తిన సత్యం.

"అబ్బా" అని "మా వదిన మా మంచి వదినా" అంటూ పాడుతూ పరుగెత్తింది.

నవ్వుతూ నోట్సు రాయడం మొదలెట్టాడు.

ఆరోజు ఆదివారం. కావాలనే సరళను బలవంతంమీద తన యింటికి రమ్మని అడిగి వొప్పించింది శశి. సరళ సరేనంది. తప్పని సరయ్యి ఆ రోజు సాయంత్రం సరళ "రేఖా!" అంటూ వరండాలోకివచ్చింది. ఇంట్లోనుండి అదే సమయానికి "పిలిచినావటే చిలుకా!" అని పాడుతూ వచ్చిన సత్యం సరళను చూచి "ఓ మీరా! రాండి" అంటూ శశీ! నీకోసం సరళ వచ్చిందారా! అంటూ కేకేశాడు.

"రావోయ్ యింతాలస్యం చేశావే? అంటూ తన గదిలోకి లాక్కుపోయింది శశి. కొంత సేపయిన తర్వాత వాళ్ళేం మాట్లాడుకుంటున్నారోవినాలనిపించింది సత్యానికి నెమ్మదిగా పనివున్నవాడిలాగ వాళ్లమ్మదగ్గరకు "అమ్మా చాకలొచ్చాడమ్మా" అంటూ శశి గదివేపు బయలుదేరాడు. సంగతికనిపెట్టి "అన్నయ్యా!" అని పిలిచింది శశిరేఖ. మాచెల్లి చాలా మంచిదనుకుంటూ గదిలోకి వచ్చి ఏంటమ్మా! అంటూనేకూర్చున్నాడు. తనలో తను నవ్వుకుంది శశి. "ఇప్పుడే వస్తా"నంటూ నెమ్మదిగా గదిలోనుండి జారుకుంది. కొంతసేపుండి "మీరు బాగా పాడతారని అన్నది మాశశి. ఒకసారి మీ పాట వినిపించరాదా సరళా!" అన్నాడు ఏమి తోచక సత్యం.

"నాకేఁ రావండీ?"అంటూ నవ్వింది సరళ.

"నే నడిగితే ఎందుకు పాడుతారులెండి" అన్నాడు ఆమెవంక తదేకంగా చూస్తూ. ఆ చూపు కామె తట్టుకోలేకపోయింది. సిగ్గుతో తలవంచి "గొంతు బాగా లేదండీ!" అన్నది.

ఇంతలో అక్కడకు వచ్చిన శశిరేఖ వాళ్ళ అవస్త కనిపెట్టి "కాస్త టీ త్రాగి పాడుదుగాని లేవోయ్ సరూ!" అంటూ బిస్కట్లతోకూడా తయారయింది. సిగ్గుపడుతూనే ఏదో కాస్త బిస్కట్లు, టీ తీసుకుంది సరళ. తర్వాత శశి బలవంతంమీద ఒక పాటపాడింది. చాలాసేపు కబుర్లాడుకున్నతర్వాత నెమ్మదిగా యింటికి వెళ్ళిపోయింది.

"బాగా పాడిందికదా శశీ!" అన్నాడు సత్యం. "నేనొక్కదాన్నేఅడిగితే పాడేది కాదన్నయ్యా" అన్నది నవ్వుతూ శశి. విననట్లుగా వూరుకున్నాడుసత్యం. అప్పుడప్పుడు సరళని గురించి అడుగుతూ వుండేవాడు శశిని.

సరళ ఆ వూరిలో కలప వ్యాపారం చేస్తున్న దశరథరామయ్యగారి కుమార్తె. సరళతర్వాత యింకా యిద్దరు మగపిల్లలు, యిద్దరాడపిల్లలు వున్నారు. కాని సరళకి వాళ్ళనాన్నదగ్గర గారాబమెక్కువ. ఆమెమాటకు అడ్డులేదు. సరళ ఏదడిగినా కాదనరు దశరథరామయ్యగారు. ఆయన అందరితోటి కలిసిమెలిసి తిరిగే స్వభావం కలవారు. అయితే సరళకు అందరూ నచ్చరు.

ఒకరోజున సరళపెళ్ళికి సంబంధింపినమాటలు జరిగినయి. ఆ రోజున సరళ అభిప్రాయం తెల్సుకున్నారు దశరథరామయ్యగారు. "ఆలోచించాలమ్మా!" అన్నారు నెమ్మదిగా. నాన్న ఇలా ఎందుకన్నాడా? అని తికమకపడింది సరళ.

కొద్దిరోజులతర్వాత దశరథరామయ్యగారు తనఆఫీసుగదిలోకి సరళనుపిలిచి చెప్పడం ప్రారంభించారు.

"అమ్మా నీకు ఒకమాటచెప్తున్నాను. నాకు సత్యం తండ్రి శ్రీశైలం బాగా తెలుసు. అయితే ఒకటివుంది. శ్రీశైలం వాళ్ళ మామయ్యకూతురు సరస్వతి అని వుండేది. చిన్నప్పటినుండి వాళ్ళిద్దరినీ అందరూ చిలుకా-గోరువంక లనేవారు. వాళ్ళల్లోను అటువంటి భావాలేవుండేవి. బావనితప్ప యింకెవ్వరిని చేసుకోనంది సరస్వతి.

సరస్వతిని తప్ప చస్తే మరొకరిని పెళ్ళాడననుకునేవాడు శ్రీశైలం.

కాని అతను ఇంజనీరింగు చదవడానికి మెద్రాసు వెళ్ళాడు. తరువాత వాళ్ళ కుటుంబానికి వీళ్ళ కుటుంబానికి మధ్య ఏవో భేదాభిప్రాయాలువచ్చాయి. అంతే మరొకనితో సరస్వతిపెళ్లి నిశ్చయమయిపోయింది. ఈవార్తవిన్న శ్రీశైలం పిచ్చివాడైపోయాడు. పెళ్ళయిన రాత్రే పాముకాటుకి చచ్చిపోయాడు పెళ్లికొడుకు. నలుగురూ నాలుగు మాటలన్నారు. కాని సరస్వతి పెళ్లికొడుకు పోయినందుకు విచారించలేదు. శ్రీశైలం యింట్లోవాళ్ళతో పోరాడి ఆఖరుకు సరస్వతిని మళ్ళా పెళ్ళి చేసుకున్నాడు. వాళ్ళను అంతా వెలివేసినట్లుగా చూసేవారు. కాని ఎవ్వరిని లెక్కచెయ్యలేదు శ్రీశైలం."

"వాళ్ళిద్దరికి కలిగిన సంతానమే నువ్వు ప్రేమించిన సత్యం; అతని చెల్లెలు శశిరేఖ. ఇహ నీ యిష్టం బాగా ఆలోచించుకోమ్మా!" అన్నారు వక్కపొడి వేసుకుని ఫైల్సుతిప్పుకుంటూ దశరథరామయ్యగారు.

"శ్రీశైలంగారు చేసింది మంచిపనేగదునాన్నా! లేకపోతే ఆమెగతేమయిపోయేది. జీవితాంతం అలా వుండిపోవలసివచ్చేదేగదు నాన్నా పాపం" అన్నది సరళ.

"అందుకని-వాళ్ళతోపాటు మనం కూడా మనబంధువులకు దూరమవడం నీ కిష్టమేనా తల్లీ!" అన్నాడు దశరథరామయ్యగారు వ్యంగ్యంగా నవ్వుతూ.

"అయితే నాకూసత్యం వాళ్లమ్మకయినట్లుగా నా పెళ్లినాటిరాత్రి పెళ్లికొడుకు పాముకరిచి చచ్చిపోతే మీరేం చేస్తారు నాన్నా? జీవితాంతం నే నలాగే వుంటే మీరెంత బాధపడ్తారు నాన్నా?" అంటూ కంట తడిపెట్టింది.

దాంతో దశరథరామయ్యగారి హృదయము కరిగిపోయింది. చాలాసేపయిన తరువాత "అవునమ్మా బెల్లం ఉన్నన్నాళ్ళే యీగలు, డబ్బున్నన్నాళ్ళే యీ బంధువులును, నీ యిష్టప్రకారమే కానివ్వమ్మా" అంటూ సరళతల నిమిరాడు.

"అమ్మా!" అంటూ సంతోషం పట్టలేక యింట్లోకి పరుగెత్తబోయిన సరళ తండ్రి ఆఫీసుగది గుమ్మంలోనే నిలువబడివున్న తల్లి కాంతమ్మనుచూచి ఆమె వళ్ళో వాలిపోయింది. కాంతమ్మ భర్త వంక చూసింది. వాళ్ళిద్దరికళ్ళూ నవ్వుకున్నాయి.

"మా తల్లి అదృష్టవంతురాలు" అంది కాంతమ్మ.

* * *

ఆదివారంనాడు నీలకంఠంగారు రామాన్నిపిలిచి "ఎవర్రా ఆ అమ్మాయి" అన్నాడు. "శ్రీశైలంగారని మన పబ్లిక్ వేస్ డిపార్టుమెంటులో యింజనీరు లేరు నాన్నా! వాళ్లమ్మాయి నాన్నా!" అన్నాడు బిక్కుబిక్కుమంటూ రామం.

"ఆఁ శ్రీశైలం కూతురా? అన్నాడు ఆశ్చర్యంతో. శ్రీశైలాన్ని మనవాళ్లంతా వెలివేశారన్న సంగతి నీకు తెలీదురా రాముడూ, ఏమిఁటీ వెధవ్వేషాలు?"

"అదికాదు నాన్నా!"

"ఏదికాదురా? ఇదిగో పిచ్చిపిచ్చి మాటలు కట్టిపెట్టి లక్షణంగా రమను పెళ్ళిచేసుకో నామాట విను"

"నాకు రమనచ్చలేదు నాన్నా"

"శశిరేఖను చూచిన తరువాతనా నాన్నా!" అని అన్నాడు వెకిలిగా నీలకంఠంగారు.

"నాన్నా నువ్వేమన్నాఅను శశిరేఖను తప్ప నే నింకెవరినీ యీ బొందిలో ప్రాణంవుండగా చేసుకోను అన్నాడు రామం.

అప్పుడు నీలకంఠంగారికి కోపంరెచ్చిపోయింది. నీలాంటి వెధవలుండబట్టే దేశంలో యీ విధంగా కులమత భేదాలుండకూడదని చెత్తా, చెదారం అనీ, మొదలెట్టి దేశాన్ని పాడుచేస్తున్నారు, హిందూమతాన్నే నాశనం చేస్తున్నారంటూ మొదలెట్టాడు నీలకంఠంగారు ఏదో చెప్పాలని ప్రయత్నిస్తూ.

"శశిరేఖ మరో కులం పిల్లకాదుగా నాన్నా, మనకులంవాళ్ళే, మనలాంటి వాళ్ళే అయితే వాళ్ళమ్మను వాళ్ళనాన్న మళ్ళీ పెళ్లిచేసుకున్నాడనా? పెళ్ళినాటి రాత్రి చనిపోయిన పెళ్ళికొడుక్కన్నూ, ఆమెకు ఏమాత్రం సంబంధంలేదుకదు నాన్నా! ముందనుకున్నట్లుగానే అనాఘ్రాణిత పుష్పంగానే స్వీకరించాడు

గదు నాన్నా శ్రీశైలంగారు ఆమెను. అందులో కులం చెడలేదని స్పష్టంగా తెలుస్తుంది. అంచేత వాళ్లను మనలో వెలివేసినట్లుగా చూడడం నాకు ఆశ్చర్యంగా వుంది."

రామం అన్న యీమాటలకు మెదలకుండా ఆలోచిస్తూ కూర్చున్నారు నీలకంఠంగారు.

"ఏవండీ! మన రోజులు జ్ఞాపకం తెచ్చుకోండి. మీరు డాక్టరు చదువుతున్న రోజుల్లో మనం ప్రేమించుకుని కాదు వివాహం చేసుకుంది? నన్ను తప్ప యింకెవర్నీ చేసుకోననీ, లేకపోతే విషం త్రాగుతాననీ, మీరు నానా గొడవచేసి, కుటుంబాల మధ్యవున్న కక్షలమూలాన మా జీవితాల్ని దుఃఖమయం చెయ్యవద్దనివాదించి ఆఖరికి మా యింట్లో ఒప్పించి వివాహం చేసుకోలేదు.

మీ ప్రతిబింబమేగావాడు. మన కింక వాడుతప్ప, యింకెవరున్నారు చెప్పండి? వాడొక్కడేగా! వాడు సుఖంగావుంటే మన కన్నుల పండుగావుంటుంది. వాడిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి! అంటూ నెమ్మదిగా నచ్చచెప్పింది రామం తల్లి సీతారావమ్మ. నీలకంఠంగారు కాస్త మెత్తబడి సరే మీ యిద్దరికీ యిష్టమయినప్పుడు నాచేముంది అన్నారు ముక్తసరిగా. అలా అంటే కాదండీ! మీరు మనస్ఫూర్తిగా అనాలి అంది సీతారామమ్మ వక్కపొడి అందిస్తూ.

"రాముడూ యిలారా. నేనువెళ్ళి శ్రీశైలంతో మాట్లాడుతానులే, చదువుకో పోఅని వీపునిమిరి ఒక పది రూపాయిల నోటు తీసి రామం చేతిలోపెట్టాడు. ఒక్కగంతేసి గదిలోకి పరిగెత్తాడు రామం.

* * *

పెద్దలు నిర్ణయించిన మంచి ముహూర్తంలో శశి, రామం-సత్యం, సరళ-శివం రమలకు వివాహాలు కన్నుల పండువుగా జరిగాయి.

శెలవులనంతరం శశి, రామంలు, సత్యం, సరళలు, శివం, రమలు సరదాగా కాలేజీ ఆవరణలో అడుపెట్టారు. ఇంతలో వాళ్ళకు మరొక జంట కనుపడింది. ఉషా, సుధాకరులు మేమిద్దరం రిజిష్టర్ మారేజ్ చేసుకున్నామోయ్ అన్నారు అయితే మాకు పార్టీ ఏది మరి అన్నారు అంతా. పదండీ! అన్నాడు సుధాకర్ కాలేజి కాంటిన్‌వైపు దోవతీస్తు. అంతా "ఆనంద నిలయం"లో సరదాగా టీ త్రాగి నవ్వుకుంటూ మెట్లెక్కి క్లాసులకు పోబోతూవుండగా "ఏవండీ! కాస్త మీ పెన్ను యివ్వరూ" అంది రమ భర్త శివంతో.

"అలా మర్చిపోయివస్తే ఎలా? లేదు ఫో!" అన్నాడు శివం నవ్వుతూ.

"పోనిలే నేనిస్తా తీసుకోండి" అంటు యిచ్చింది పెన్ను శివానికి. అప్పుడు తెలిసింది శివానికి తనేమర్చిపోయోచ్చానని. అతన్నేడిపిద్దాం అని, యిహనుంచీ మీ పెన్ను రమదగ్గరే వుంటుందనుకుంటాను!" అన్నది శశి నవ్వుతూ. వెంటనే "సోదర సోదరీ మణులారా! మీరంతా ఎవరిపెన్నులు వాళ్ళు తెచ్చుకున్నారా?" అన్నాడు. పెద్దగా శివశంకరం రమవంక చిలిపిగాచూస్తు.

"చిత్తం!" అన్నారంతా.

"వెరీగుడ్! వస్తాం!" అంటూ రమతో పాటు క్లాసులోకి దారి తీశాడు శివం.

"నవ దంపతులకు సుస్వాగతం" అని బోర్డుమీద రాసివుంది క్లాసులో.

"థాంక్స్ మైఫ్రెండ్స్!" అని రాశాడు శివం.

"క్లాసంతా పొట్ట చెక్కలయ్యేటట్లు నవ్వుకున్నారు శివం హాస్య ధోరణికి.

ఇంతలో లెక్చరర్ వచ్చాడు. అంతా నిశ్శబ్దం. ★

# దెబ్బకు దెబ్బ

రచన: వీయారేరువ

మద్రాసులో కాలేజి చదువులు చదివే రోజుల్లో, ఒక కాలేజీ విద్యార్థి వుండేవాడు. అతడు చాల చురుకైన వాడు. ఆంధ్రదేశంలో యఫ్. ఎ మంచి మార్కులతో ప్యాసయి మదరాసులో ఓ ఘనత జెందిన కాలేజిలో ఆనర్సులో చేరడానికి వచ్చాడు. ఆ కాలేజి ప్రిన్సిపాల్ ఓ మలయాళీ, ముదుసలి దానికి తోడు అతనికి ముక్కుమీదే కోపం, మన వాడుపోయి తన గొప్పతనం చూపించి ఒక ఆనర్సు పాలిటెక్స్ సీటివ్వమని కోరాడు. "నిదేవూరు?" అని ప్రిన్సిపాల్ అడగ్గ "ఆంధ్రలో ఒక పల్లె" అన్నాడు మన అబ్బాయ్. అంతలో అయన "ముందు తొందరగ బయటికి వెళ్లు" అని ముఖమంతా ఎఱ్ఱజేసుకొని కసిరాడు "ఎందుకుసార్"—"ఇది తమిళుల కొఅకు" అయితే "మళయాళీ అయిన నీవెట్లు ఇందులో దూరావు"—దీనితో ఆయనకు కోపం మిక్కలియై "బయటకు త్రోయించాలా" అన్నాడు.

మనవాడు సరేయనుకొని బయటికి వచ్చి ఎక్కడో ఏకాలేజిలోనో చేరి చదువుతూ తనకు జరిగిన దానికి ప్రతీకార మెట్లా చేయాలని ఆలోచించి ఒక నిశ్చయానికి వచ్చినాడు.

ఆ ప్రిన్సిపాల్ ఫోనులో మాట్లాడే విధానాన్ని అనుకరించడం నేర్చుకొన్నాడు. తర్వాత ఒక పబ్లిక్ టెలిఫోను నుంచి, అచ్చం ప్రిన్సిపాల్ మాట్లాడి ట్లే ఒక పెద్దఐస్ కంపెనీకి ఒక వందయాభై హైక్లాస్ ఐస్ క్రీములను ఆ ప్రిన్సిపాల్ ఆఫీసు వద్దకు సాయంత్రం నాలుగు గంటలకు తప్పక తీసుకురావాలని ఆర్డరు ఇచ్చాడు. సాయంత్రం ప్రిన్సిపాల్‌గారు కాలేజి నుంచి పోయేసమయంలో ఐస్ క్రీమ్ వ్యాన్ ఎదురుగా వచ్చింది ఈ
చూచి ప్రిన్సిపాల్‌కు కో
నుంచి నన్నెత్తి
చెయ్యాలో